Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 220 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 10 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# 'మీ భూమి-మీ హక్కు'లో రైతులకు పొలంలోనే పాస్ బుక్ అందజేసిన చంద్రబాబు





**బాపట్ల, (రాజధాని వార్తలు):** మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా సీఎం నారా చంద్రబాబు నాయుడు రైతులకు పొలంలోకి వెళ్లి పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం బాపట్ల జిల్లా, వేమూరు నియోజకవర్గం, సూరేపల్లిలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్వేయర్ స్వప్నతో కలిసి రైతులు వాకా శ్రీనివాసరావు, మూరల వెంకటేశ్వర్లుకు చెందిన పొలాల వద్దకు వెళ్లారు. గత ప్రభుత్వ తప్పులు సరిదిద్ది, జగన్ ఫోటోతో ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలకు బదులుగా క్యూఆర్ కోడ్‌తో కూడిన పుస్తకాలను రైతులకు అందించారు. సర్వే నంబరు, ఖాతా నంబరు సరిగా ఉన్నాయా అని స్వయంగా రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. రైతులు శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను సీఎం చంద్రబాబు అందించారు.

# గుడిమల్లం శ్రీ ఆనందవల్లీ సమేత శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానం మహా కుంభాభిషేకానికి యార్లగడ్డ వెంకట్రావుకు ఆహ్వానం



**గన్నవరం, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లంలోని శ్రీ ఆనందవల్లీ సమేత శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానంలో జరగనున్న మహా కుంభాభిషేక మహోత్సవానికి సంబంధించి ఆలయ కమిటీ ప్రతినిధులు ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఏప్రిల్ 19 నుండి 23, 2026 వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవంలో ప్రధాన ఘట్టమైన మహా కుంభాభిషేకం ఏప్రిల్ 23వ తేదీ గురువారం ఉదయం 7:30 నుండి 8:30 గంటల మధ్య వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు వంశీ కృష్ణ శర్మ, కార్యనిర్వహణాధికారి కోటి రామచంద్రారెడ్డి మరియు బోర్డు సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. భారతదేశంలోనే అత్యంత ప్రాచీన శివాలయాలలో ఒకటిగా పేరుగాంచిన ఈ ఆలయం ప్రస్తుతం కేంద్ర పురావస్తు శాఖ ఆధీనంలో ఉంది. ఆలయంలో నిర్వహించే ధార్మిక కార్యక్రమాలపై ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గతంలో శాసనసభలో ప్రత్యేకంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పురావస్తు శాఖ నిబంధనల ప్రకారం మూలవిరాట్ శివలింగానికి రోజుకు ఒక్కసారే అభిషేకం నిర్వహిస్తుండగా, ఆగమ శాస్త్రం ప్రకారం రోజుకు రెండు పూటలా అభిషేకం జరిగేలా చర్యలు తీసుకోవాలని యార్లగడ్డ అసెంబ్లీ వేదికగా కోరారు. ఆలయ ప్రాముఖ్యతను గుర్తించి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినందుకు ఆలయ ప్రధాన అర్చకులు మరియు బోర్డు సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి ఈ మహా క్రతువులో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఆన్‌లైన్ అనువాదకులు కావలెను

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, విజయవాడలో ఆన్‌లైన్ అనువాదకులుగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నాము. ఎంపికైన వారు ఆంగ్లం తెలుగు అనువాదం చేయాల్సి ఉంటుంది.

అర్హతలు: ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ ఉండాలి. తెలుగు, ఆంగ్ల భాషలపై మంచి పట్టు ఉండాలి. కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. అనుభవం ఉన్న వారికి ప్రాధా న్యత ఉంటుంది (ప్రెస్ విడుదలలు, న్యూస్ అనువాదం, జర్నలి జం మొదలైనవి).

దరఖాస్తు విధానం:

ఈ నోటీసు వచ్చిన తేదీ (09.04.2026) నుండి 15 రోజుల్లోపు దరఖాస్తు చేయాలి. అప్లికేషన్ ఫారమ్ నింపి, అవసరమైన పత్రాలతో కలిసి ఈ మెయిల్‌కు పంపాలి: selection.pibap@gmail.com

# ఈనెల 16, 17 తేదీల్లో విశాఖపట్నంలో అసెంబ్లీ పిటిషన్ల కమిటీ పర్యటన

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పిటిషన్ల కమిటీ ఈనెల 16, 17 తేదీల్లో విశాఖపట్నంలో పర్యటించనుందని ఏపి అసెంబ్లీ సెక్రటరి జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర తెలియజేశారు. ఈ కమిటీ ఈనెల 7, 8 తేదీల్లో విశాఖలో పర్యటించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఈ పర్యటన ఈనెల 16, 17 తేదీల్లో జరగనుందని తెలియజేశారు.

# మావిగన్ కామెడీ అయిపోయింది...ఆ పేరు చెప్పగానే జనాలు నవ్వుకుంటున్నారు

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వైసీపీపై మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. ఏలూరులో నూతనంగా నిర్మించిన మహిళా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అంశంపై అనిత వ్యంగ్యంగా స్పందించారు. "మావిగన్ పేరు పెద్ద కామెడీ అయిపోయింది. ఆ పేరు ఎత్తితేనే ప్రజలు నవ్వుకుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అభివృద్ధి వివరణ ఇచ్చుకోలేని స్థితిలో ఉంది" అని అన్నారు. అమరావతి అనేది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని, రూ. 2 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నారంటూ వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం కలిపిన ప్రాంతమే సీఆర్‌డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) అనే విషయం తెలియకుండా మాట్లాడుతున్నారని అన్నారు. "విధ్వంసం చేసే వ్యక్తులు స్వేచ్ఛగా తిరిగితే రాష్ట్రంలోని మహిళలకు భద్రత ఎలా ఉంటుంది? అలాంటి వారిని అరెస్టు చేయడానికి నాకు నిమిషం పట్టదు, కానీ చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అని హెచ్చరించారు. రాష్ట్ర పునర్నిర్మాణ ప్రక్రియ మొదలైందని, విధ్వంసకర శక్తులను ఐక్యంగా ఓడించాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# మంత్రి కొండపల్లిని కలిసిన సీఐఐ





**అమరావతి, (రాజధాని వార్తలు):** సీఐఐ ఏపీ ఛాప్టర్ సభ్యులు గురువారం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీ సీఐఐ ఛైర్మన్, అపెక్స్ సొల్యూషన్ ఐటీ కంపెనీ అధినేత సరణం నరేంద్రకుమార్, సీఐఐ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావుతో పాటు సీఐఐ ఏపీ ఛాప్టర్ హెడ్ రాజేష్ మంత్రిని కలిసి పలు విషయాలు చర్చించారు. ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో మూడేళ్ల కాలంలో 10 వేల మంది ఎస్‌హెచ్‌జీలకు శిక్షణ ఇచ్చేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నట్టు సీఐఐ సభ్యులు తెలిపారు. అలాగే పారిశ్రామిక ఉద్యోగాల కల్పనకు కూడా సీఐఐ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నట్టు కూడా వారు మంత్రికి తెలిపారు. ఇప్పటికే నాలుగు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు (స్కిల్లింగ్ సెంటర్స్) ద్వారా మూడు వేలమందికి శిక్షణ ఇస్తుండగా.. మరో నాలుగు కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించినట్టు సీఐఐ సభ్యులు తెలిపారు.

# రాజ్యాంగబద్ధ తీర్పులకు గంగాభవాని కృషి చేయాలి

## - ఎన్నికలలో గెలుపొందిన న్యాయవాది గంగా భవానికి అభినందన సభ




**విజయవాడ, (రాజధాని వార్తలు):** న్యాయస్థానాలలో రాజ్యాంగబద్ధ తీర్పులకు గంగాభవాని కృషి చేయాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఎం.ఏ సుభాన్ ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ మెంబర్ అడ్వకేట్ గంగాభవాని 2026 ఎన్నికలలో గెలిచిన సందర్భంగా బుధవారం, వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. సభలో పలువురు వక్తలు గంగాభవాని సామాజిక రాజకీయ నిబద్ధతలను ఆమె ఉత్తమ వ్యక్తిత్వాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేఎంఏ సుభాన్ మాట్లాడుతూ ఎన్.ఆర్.సి షాహిన్బాగ్ ఢిల్లీ రైతు ఉద్యమాలలో ఆమె పాత్రను కొనియాడారు. నేడు రాజ్యాంగ వ్యతిరేక అంశాలే తీర్పులుగా న్యాయస్థానాలు వెలువరిస్తున్న నేపథ్యంలో గంగాభవాని గెలుపు ఒక ఆశాకిరణమని న్యాయస్థానాలలో రాజ్యాంగబద్ధ తీర్పులకు గంగాభవాని కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గంగాభవాని మాట్లాడుతూ తన గెలుపు కోసం కృషి చేసిన అడ్వకేట్లకు, పార్టీలకు ప్రజా సంఘాల సంఘాలకు వ్యక్తులకు తన కుటుంబ సభ్యులకు విశేషంగా ధన్యవాదాలు తెలిపారు. తనకు లభించిన అవకాశం ద్వారా లాయర్ల సమస్యలు ప్రత్యేకించి స్త్రీల సమస్యలపై మానవ హక్కులపై బాధ్యతాయుతంగా కృషి చేస్తానని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ రాంప్రసాద్, రెడ్డి, పార్టీ మహిళా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డీలర్లు రైతులకు కాంప్లెక్స్ ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలి : ఏడిఏ ఎన్.మోహన్ రావు




**గుంటూరు, (రాజధాని వార్తలు):** ఎరువుల డీలర్లు ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 ప్రకారమే రైతులకు ఎరువుల అందించాలని గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు (రెగ్యులర్) ఎన్. మోహన్ రావు అన్నారు. గురువారం మేడికొండూరు మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో విత్తనములు, ఎరువులు మరియు పురుగుమందుల డీలర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశం ఆయన పాల్గొని డీలర్లకు పలు అంశాల గురించి సూచనలు చేశారు, ముఖ్యంగా ఇన్పుట్ డీలర్స్‌ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎరువుల డీలర్స్ అందరు, ఎరువుల లైసెన్స్ కలిగి ఉండి, లైసెన్సు ద్వారా మాత్రమే రైతులకి ఎరువుల అమ్మాలని చెప్పారు. యూరియా మరియు డిఏపి ఎరువులను ఎమ్మార్పీ రేట్లుకి మించకుండా, రైతులుకు అందించాలని, ఎటువంటి బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చూడాలని తెలిపారు. లింక్ ప్రొడక్ట్స్ అంటగట్టకుండా ఇవ్వాలని తెలియ చేశారు. రైతు సోదరులు అందరికి కూడా అధిక యూరియా వాడకం వలన వచ్చే అనార్ధాలను తెలియచేయాలని చెప్పారు. యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, ఒకేసారి యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వాడకుండా దఫ దఫాలుగా వేసుకోవాలని తెలియచేశారు. అలాగే యూరియా, డిఏపి బదులుగా నానో యూరియా నానో డిఏపి, బయో ఫెర్టిలైజర్స్ వాడాలని చెప్పారు. ప్రతి డీలర్ కూడా రైతు సోదరులకు సక్రమంగా ఎరువులు అందించాలని, అలాగే వారి యొక్క పట్టాదారు పాస్ పుస్తకం నకలు తీసుకొని విస్తీర్ణం వారిగా పంటల వారీగా వారికి ఎరువులు అందించాలని చెప్పారు. ముఖ్యంగా డీలర్లు వారి యొక్క ఎరువులు ఫిజికల్ బ్యాలెన్స్‌కి, స్టాక్ రిజిస్టర్ బ్యాలెన్స్‌కి, ఈ పోస్ మిషన్‌కి టాలీ అవ్వాలని చెప్పారు. అలాగే సోర్స్ ఆఫ్ సప్లై ఫారం 'O' ద్వారానే మాత్రమే కొనుగోళ్లు చేసుకోవాలని చెప్పారు. అంతేకాకుండా రైతు సోదరులకు ఎరువులను ఎటువంటి లింకులు అంటగట్టకుండా, యమ్ఆర్‌పి రేటుకి మించకుండా అందించాలని తెలియజేశారు. డీలర్లు అందరూ వారియొక్క లైసెన్సులు, స్టాక్ బోర్డులు కనబడేటట్లు చూసుకోవాలని చెప్పారు. ఎరువుల డీలర్లు అందరూ కూడా ప్రతినెల వారి యొక్క స్టాక్ రిపోర్టుల్ని మండల వ్యవసాయ అధికారికి, సహాయ సంచాలకుల కార్యాలయం మరియు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి అందజేయాలని చెప్పారు. అలాగే ఎరువుల్ని అనధికారిక గోడాన్స్‌లో నిలవ చేయకుండా లైసెన్సు ఉన్నటువంటి గోడౌన్‌లలోనే నిలువ చేయాలని చెప్పారు, ప్రతి ఒక్క డీలర్ కూడా వారి యొక్క రిజిస్టర్స్‌ని మండల వ్యవసాయ అధికారి ద్వారా సర్టిఫైడ్ చేయించుకోవాలని తెలియజేశారు. వ్యవసాయ అధికారిని కె.లక్ష్మీ మాట్లాడుతూ రైతు సోదరులందరికి ఈ సంవత్సరం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందజేయాలన్నారు. డీలర్లు అందరూ తప్పనిసరిగా రైతులకు బిల్లు ఇవ్వాలని, బిల్లు మీద రైతు సంతకం తీసుకోవాలని చెప్పారు. అలాగే విత్తనాలను కూడా సోర్స్ అఫ్ సప్లై ఉన్న కంపెనీల ద్వారానే అమ్మాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఇన్పుట్ డీలర్లు, డీలర్స్, సొసైటీ సీఈఓలు పాల్గొన్నారు.

# “రాధాకృష్ణకు కాకాణి ఘాటు హెచ్చరిక”








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులోని ఆంధ్రజ్యోతి యూనిట్ ఆఫీస్ వద్ద మాజీ మంత్రి వర్యులు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి పార్లమెంటు సభ్యులు గురుమూర్తి సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, వైఎస్ఆర్ సీపీ రూరల్ ఇంచార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పూజిత, వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు, మహిళలు కలిసి పెద్ద ఎత్తున ఆందోళన. నెల్లూరు ఏబీఎన్ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ సీపీ ధర్నా. భారీగా తరలి వచ్చిన వైఎస్ఆర్ సిపి శ్రేణులు. కాకాణి పూజిత ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను అడ్డుకున్న పోలీసులతో తీవ్ర వాగ్వాదం. రాధాకృష్ణకు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేసిన వై ఎస్ ఆర్ సి పి మహిళా నాయకులు. ఆంధ్రజ్యోతి యూనిట్ ఆఫీస్ వద్దకు వైయస్ఆర్ సీపీ శ్రేణులను వెళ్లనివ్వకుండా అడ్డుకున్న పోలీసులు. ఒక దశలో మాజీ మంత్రి కాకాణిని అరెస్ట్ చేసేందుకు తీవ్ర ప్రయత్నం చేసిన పోలీసులు. కాకాణి పూజితను అడ్డుకొని, వాగ్వాదానికి దిగిన నెల్లూరు నగర అడిషనల్ ఎస్పీ దీక్ష ఐపీఎస్. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తీవ్రంగా అడ్డుపడడంతో విధిలేక నిరసన కార్యక్రమాన్ని చేపట్టడానికి అనుమతించిన పోలీసులు. ఏబీఎన్ రాధాకృష్ణపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు, నాయకులు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా దాదాపు రెండు గంటలసేపు, ఏబీఎన్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు. ఆంధ్రజ్యోతి పత్రికలను తగులబెట్టి, నిరసన వ్యక్తం చేసిన నాయకులు కార్యకర్తలు. మండుటెండను సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో పాల్గొన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ముఖ్యంగా మహిళలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసిన కాకాణి. ఏబీఎన్ రాధాకృష్ణ వ్యాఖ్యలకు నిరసన తెలియజేస్తుంటే, సిబిఎన్ అడ్డుపడుతున్నాడు. ఏబీఎన్, కార్యాలయం ముందు నిరసన అంటే, పోలీసులు సిబిఎన్, కార్యాలయం ముందు నిరసన లాగా భావిస్తున్నారు. ఏబీఎన్‌కు, సిబిఎన్‌కు ఉన్న బంధం నేడు నిర్ధారణ అయింది. సిబిఎన్ ఆదేశిస్తే, ఏబీఎన్ రాధాకృష్ణ ఆచరించడం ఆనవాయితీగా తయారైంది. మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసిన రాధాకృష్ణకు, చెల్లికి, ఆలికి, తేడా తెలియదని భావిస్తున్నాం. రాధాకృష్ణకు వావి, వరసలు, లేవు. రాధాకృష్ణకు నీతి, నిజాయితీ, లేదు. రాధాకృష్ణకు ఉన్నది చంద్రబాబు భజన మాత్రమే. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల వ్యక్తిగత జీవితాల గురించి మరొక్కసారి మాట్లాడితే, రాధాకృష్ణ మూల్యం చెల్లించుకోక తప్పదు. రాధాకృష్ణ వ్యక్తిగతంగా మాపై ఎన్ని మాట్లాడిన, పట్టించుకోం. రాధాకృష్ణ కుటుంబ సభ్యుల జోలికి వస్తే మాత్రం, విడిచిపెట్టం. రాధాకృష్ణ ఇకనైనా కుటుంబ సభ్యుల గురించి మాట్లాడడం మానుకోవాలని హితవు చెబుతున్నాం. జగన్మోహన్ రెడ్డి చెప్పిన “మావిగన్” శంకరాభరణం సినిమాలాంటిది. శంకరాభరణం సినిమాకు రెండు వారాలపాటు కలెక్షన్‌లు లేవు, శంకరాభరణం సినిమా రెండు వారాలు తర్వాత, రెండు కిలో మీటర్ల మేర ప్రేక్షకులు టికెట్ల కోసం తాపత్రయపడ్డారు. జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన “మావిగన్” విషయంలో కూడా విస్తృత చర్చ ప్రారంభమైంది.

ఆంధ్ర రాష్ట్ర ప్రజలు “మావిగన్” ప్రస్తావనతో చాలామంది ఆకర్షితులవుతున్నారు. చంద్రబాబు కేవలం అమరావతిని బంగారు బాతులాగా భావించి, తన ఆర్థిక స్వప్రయోజనాల కోసం ప్రాకులాడుతున్నాడు. రాష్ట్ర సమగ్ర అభి వృద్ధిని గురించి ఆలోచన చేస్తున్నది, మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాత్రమే. జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజల మద్దతు రోజు రోజుకు “మావిగన్” విషయంలో పెరుగుతుంది. జగన్మోహన్ రెడ్డికి మావిగన్ విషయంలో ఆదరణ పెరుగుతుందని ముందు గానే పసిగట్టిన రాధాకృష్ణ ముఠా వ్యక్తిగత హననానికి పూను కుంది. రాధాకృష్ణ తన మనసులో ఉన్న బాధ, ఆవేదనను, మాటల రూపంలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడితే, సంగతి తేలుస్తామని హెచ్చరిస్తున్నాం.

# పిల్లల భవిష్యత్తు బలపడాలంటే తొలి 6 సంవత్సరాలే కీలకం: కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చిన్నారుల జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలు మెదడు అభివృద్ధికి అత్యంత కీలకమైనవని, ఈ దశలో సరైన పోషణ, సంరక్షణ ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పేర్కొన్నారు. బుధవారం తన ఛాంబర్ నందు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 8వ పోషణ్ పక్షవాడా కార్యక్రమాలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం పోషణ్ పక్షవాడా కార్యక్రమాలు ఏప్రిల్ 9 నుండి 23 వరకు “సహీ పోషణ్, దేశ్ రోషన్” అనే నినాదంతో నిర్వహించబడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తల్లి, శిశు పోషణ, 0–3 సంవత్సరాల పిల్లల మెదడు అభివృద్ధికి ప్రారంభ ప్రేరణ, 3–6 సంవత్సరాల పిల్లలకు ఆటల ఆధారిత ప్రారంభ విద్య, స్క్రీన్ టైమ్ తగ్గింపులో తల్లిదండ్రులు సమాజం పాత్ర, అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి సమాజ మద్దతు వంటి ముఖ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, అంగన్వాడీ సేవలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా ఐసీడీఎస్ పిడీ హేనా సుజన్‌ను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ స్థాయిలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో ప్రతి లబ్ధిదారునికి సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ సుజాత, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ అనురాధ, అధికారులు, జిల్లా స్థాయి అధికారులు మరియు ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# 12న అంగరంగ వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం... ప్రత్యేక ఆకర్షణగా రామ రావణ యుద్ధం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక బాలాజీ నగర్ సీతారామస్వామి దేవస్థానం నందు బ్రహ్మోత్సవాలలో భాగంగా వివిధ రకాల ఉత్సవాల నిర్వహణ అనంతరం ఈనెల 12వ తేదీ శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించుచున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ రావణ యుద్ధం రావణ వధ, ఆంజనేయుని సంజీవ పర్వతం తీసుకు రావడం వంటి ఘట్టాలను వివిధ విద్యుత్ అలంకారంతో రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున నెల్లూరు పట్టణ ప్రజలు 12వ తేదీ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షులు తన్నీరు మస్తాన్ రావు, కళ్యాణ మండపం అధ్యక్షులు అమరా మోహన్ రావు, బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్ ఎంపీ ఆంజనేయులు, సెక్రటరీ సోమిశెట్టి వెంకట రత్నం, ట్రెజరర్ కొప్పవరపు శివప్రసాద్, కమిటీ సభ్యులు ఖా ప్రసాద్ రావు, కళ్యాణ మండపం ట్రెజరర్ హనుమంతరావు, కమిటీ సభ్యులు పి సుకుమార్, కమిటీ మెంబర్ పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్.. భాగ్యనగరంలో కీలక మార్పులు



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి, ఈ మార్గాన్ని ‘మోడల్ కారిడార్’గా తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా గురువారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, ఐపీఎస్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఐఏఎస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. అధికారులందరూ కలిసి ఒకే బస్సులో ప్రయాణిస్తూ.. మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు (ట్రాఫిక్ అడ్డంకులు), నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను స్వయంగా పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎన్ఎండిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్–1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిల (ఫ్రీదీ)ను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి, రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ మీడియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎన్ఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సమీపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నంబర్ 12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఐపీఎస్ పేర్కొన్నారు. నగరంలోని ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ. 20 కోట్ల చొప్పున మొత్తం రూ. 120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్ ఐపీఎస్ (జాయింట్ సీపీ ట్రాఫిక్), జి ముకుంద రెడ్డి ఐఏఎస్ (జోనల్ కమిషనర్), ప్రియాంక ఆలా ఐఏఎస్ (జోనల్ కమిషనర్), కాజల్ ఐపీఎస్ (డీసీపీ ట్రాఫిక్), కె.శ్రీనివాస్ (చీఫ్ సిటీ ప్లానర్), ఎస్.రత్నాకర్ (చీఫ్ ఇంజనీర్), వేణుగోపాల్ రెడ్డి (అడిషనల్ డీసీపీ), డి. ధనలక్ష్మి (ఏసీపీ ట్రాఫిక్ గోల్కొండ) ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నందు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించడమైనది. ఈ కార్యక్రమములో సంకల్ప హాస్పిటల్ అధినేత డాక్టర్ కె శ్రీరామ్ కుమార్ ఎండి గోల్డ్ మెడలిస్ట్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగినది. ఈ అవగాహన సదస్సులో 2026 అంతర్జాతీయ ఆరోగ్య సూత్రమైన అందరూ ఐకమత్యంగా ఉండాలి సమాజం ఆరోగ్యంగా ఉండాలి అనే టాపిక్ మీద చాలా చక్కని సందేశం ఇవ్వడమైనది. ఎండాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఏదైనా వ్యాధి సోకినప్పుడు వెంటనే డాక్టర్ను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమైనది అని చెప్పడం జరిగినది. దీనితోపాటు షుగర్ బిపి పరీక్షలు కూడా ఉచితంగా చూడడమైనది ఈ కార్యక్రమంనకు 203 గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, అధ్యక్షులు షేక్ నసీర్ అహ్మద్, కార్యదర్శి శానంపూడి సుబ్బరాయుడు, గౌరవ అధ్యక్షులు బిరుదవోలు రామ్మోహన్ రెడ్డి, ఆర్‌సి పలగాటి శ్రీనివాసులు రెడ్డి, పత్తిపాటి రమణయ్య, లక్కాకుల శ్రీనివాసులు, వినుకొండ వెంకటేశ్వర్లు, బెల్లం చెంచయ్య నాయుడు, సాయి సుబ్బారావు, కాగోళ్ళ శివయ్య, గువ్వల నారాయణరెడ్డి, బి మారుతి రావు, కె.వెంకటరమణ, రావూరి సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వర్గాల అభ్యున్నతే మేధో మధన సదస్సు లక్ష్యం

## - బీసీ జెఏసి జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య










**విజయవాడ, (రాజధాని వార్తలు):** దేశములోని బీసీల అభ్యున్నతికి మేధో మధన సదస్సు నిర్వహించడం జరిగింది అని బీసీ జెఏసి జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. మం గళవారం విజయవాడలో బీసీ వెల్ఫేర్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వ హించబడిన మేధో మధన సదస్సు అత్యంత ప్రాముఖ్యంతో కూడిన కార్యక్రమంగా విజయవంతంగా జరిగింది. ఈ సదస్సు ద్వారా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అభ్యున్నతికి హక్కుల సాధన, సామాజిక న్యాయం వంటి కీలక అంశాలపై లోతైన చర్చలు జరిగింది. రాజ్యసభ సభ్యులు పాక వెంకట సత్యనారాయణ, బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్, అలాగే రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు ముఖ్య అతిథులుగా విచ్చేసి వారి వారి అమూల్యమైన సందేశాలను ఇవ్వడం జరిగింది. స్ఫూర్తిదాయకంగా ఉండి, బీసీ వర్గాల అభ్యున్నతికి దిశానిర్దేశం చేశాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం తరపున రాష్ట్ర అధ్యక్షులు నెల్లూరు కృష్ణ సింగ్, సలహాదారులు ఆర్.శ్రీనివాస్ సింగ్, బొందిలి కుల వృత్తాంత పుస్తక రచయిత శ్రీధర్ సింగ్ విజయవాడ జిల్లా అధ్యక్షులు శ్రీ లక్ష్మీనారాయణ సింగ్, వైస్ ప్రెసిడెంట్ తిలక్ రామ్ సింగ్ పాల్గొని, తమ సమాజానికి సంబంధించిన సమస్యలు, అవసరాలు మరియు అభివృద్ధి దిశగా తీసుకోవలసిన చర్యలపై సమగ్రంగా అభిప్రా యాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మన బొందిలి సమాజానికి ఓబీసీ హోదా కల్పించేందుకు కృషి చేస్తామని ఆర్. కృష్ణయ్య, పాక వెంకట సత్యనారాయణ, బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీలకు అన్ని విధాలుగా న్యాయం జరగడానికి సమిష్టిగా కృషి చెయ్యాలని అన్నారు. బీసీ నేతలు హామీ ఇవ్వడం ఎంతో సంతోషకరముగా ఉందని పలువురు హర్షం వ్యక్తం చేసారు. నూతన ఆశలను నింపే అంశం. వారి ఈ మాటలు మన సమాజ భవిష్యత్తుకు బలమైన నమ్మకాన్ని కలిగించిందని సభ అభిప్రాయపడింది. అదేవిధంగా మన బొందిలి కులం యొక్క సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన ప్రస్తుత పరిస్థితులను ఆర్.కృష్ణయ్యకి వివరంగా తెలియజేసి సంబంధిత ఆధారాలతో కూడిన సమాచారాన్ని సమర్పించడం జరిగింది. వెంటనే సానుకూలంగా ఆయన స్పందించి ఈ చర్య మన సమాజానికి న్యాయం సాధించే దిశగా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ బొందిలి సంఘం తరపున ఆర్.కృష్ణయ్యకి, అలాగే ఇతర ప్రముఖ అతిథులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా వారి సహకారం, మార్గదర్శ కత్వం మన సమాజ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బొందిలి సంఘం నేతలు, బీసీ నేతలు, తదితరులు ఉన్నారు.

# ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలి

## - పొన్నపూడి కొత్తూరు పాఠశాల హెచ్ ఎమ్ ప్రతాప్ కుమార్


**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రతి ఒక్కరు ఆరోగ్య పరిరక్షణపైన అవగాహన కలిగి ఉండాలని పొన్నపూడి కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రతాప్ కుమార్ సూచించారు. నెల్లూరుకు చెందిన రూరల్ రీకన్స్ట్రక్షన్ అండ్ రీహేబిలిటేషన్ ఎడ్యుకేషనల్ సొసైటీ (ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పొన్నపూడి కొత్తూరు గ్రామంలోని పాఠశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చర్చా సమావేశం నిర్వహించడంతో పాటు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ మనిషికి తన జీవితంలో అత్యంత విలువైనది, ప్రధానమైనది ఆరోగ్యమే అని అందుకే ఆనాడే మన పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పారని, ప్రతి ఒక్కరూ ఈ నానుడిని గుర్తుంచుకొని ఆరోగ్యాన్ని అత్యంత జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో ఆహారం పూర్తిగా కల్తీ అయిపోయిందని, ప్రతి ఒక్కరు వారి వారి ఇళ్లలోనే కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకొని రసాయనాలు లేని కూరగాయ




లను పండించుకొని తినాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఎక్కడబడితే అక్కడ ఏమంటే అవి తినకుండా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలోప్రజా సేవ సంస్థ అధినేత కొండూరు బాబు, వైద్య సిబ్బంది సుజాత యమునా, ఉపాధ్యాయులు శైలజ,సురేష్ లతో పాటు విద్యార్థులు, గ్రామస్తులుపాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

# పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## - గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్




**గూడూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గూడూరు నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి ద్వారా సుమారు 6 కోట్ల రూపాయలు అందించామని ఇంకా ఎవరైనా సీఎం సహాయ నిధి కావాలనుకుంటే వారు పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. బుధవారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు స్థానిక ఎమ్మెల్యే సునీల్ కుమార్ వారికి ఘన స్వాగతం పలికి కార్యకర్తలను పరిచయం చేశారు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 19 లక్షల 52 వేల 80 రూపాయల చెక్కులను 42 మంది లబ్ధిదారులకు అందజేశారు. మూడో సంవత్సరం అరుంధతి పాలెం కు చెందిన పేద విద్యార్థి ప్రవీణ్ తేజకు కంప్యూటర్, ఎన్ ఆర్ పల్లికి చెందిన వెంకటసుబ్బయ్యకు వీల్ చైర్ అందజేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నామని పేద ప్రజల ఆరోగ్య విషయంలో నాయకులెవరు పార్టీలు చూడొద్దని సూచించారు. అలాగే సీఎం సహాయనిధి అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేరు నాయకులు లబ్ధిదారులకు తెలియజేయాలని కోరారు గోపాలపురం ఎమ్మెల్యే వెంకట రాజు మాట్లాడుతూ సునీల్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని ఇప్పటివరకు నియోజకవర్గంలో 779 మందికి సీఎం సహాయ నిధి అందించడం అభినందనీయమని అన్నారు. మంచి నాయకత్వంలో నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేసి రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, చిట్టమూరు మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ నాయుడు, శివకుమార్ ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

# "తప్పుడు ప్రచారం చేస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

**ఏర్పేడు, (రాజధాని వార్తలు):** ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామ ప్రాథమిక పాఠశాల భూమి వివాదంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సంబంధిత భూమి యజమానులు స్పందిస్తూ, తాము ఎలాంటి అక్రమ రిజిస్ట్రేషన్ చేయలేదని స్పష్టం చేశారు. చట్టబద్ధమైన పత్రాలు, కోర్టు తీర్పులు, హైకోర్టు ఆదేశాల ఆధారంగానే తమ పేరున రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. భూమి యజమానుల వివరాల ప్రకారం, ఈ స్థలాన్ని తమ తాతగారు 1962లో ఓ క్రిస్టియన్ మిషనరీ వద్ద నుంచి చట్టబద్ధంగా కొనుగోలు చేశారని, అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఆ డాక్యుమెంట్లు కోర్టుకు కూడా సమర్పించినట్లు పేర్కొన్నారు. తర్వాత ప్రభుత్వం ఆ స్థలంలోని కొంతభాగంలో పాఠశాల నిర్మించిందని, అప్పట్లో ఆ భూమికి బాడుగగా నెలకు రూ.5 చెల్లిం చేదని వివరించారు. అనంతరం ఆ మొత్తం సరిపోదని తమ తాతగారు 1977లో అభ్యర్థించగా, అప్పటి డెవలప్మెంట్ అధికారి బాడుగను రూ. 25కు పెంచుతూ ప్రొసీడింగ్స్ జారీ చేశారని వెల్లడించారు. తరువాత కొందరు వ్యక్తులు స్థలాన్ని అమ్మాలని ఒత్తిడి చేసినప్పటికీ తాము నిరాకరించడంతో కోర్టు వివాదం ప్రారంభమైందని చెప్పారు. 1991లో కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని తెలిపారు. అనంతరం పాఠశాల ఇప్పటికే నిర్మిం చబడిన భాగాన్ని పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కోర్టు సమక్షంలో ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. అయితే మిగి లిన 16 సెంట్ల స్థలం తమదేనని కోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చిందని, ఆ మేరకు ఆ స్థలం తమకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. 2005లో తమ తాత మరణించిన తర్వాత కూడా కొందరు వ్యక్తులు మళ్లీ భూమిపై హక్కులు కోరుతూ బెదిరింపులకు దిగారని, దీంతో 2007లో మళ్లీ కోర్టును ఆశ్రయించామని చెప్పారు. ఆ కేసులో కూడా తమకే అనుకూలంగా తీర్పు వచ్చిందని, హైకోర్టు కమిషనర్ పర్యవేక్షణలో పోలీస్ రక్షణతో మండల సర్వేయర్ ద్వారా 16 సెంట్ల స్థలాన్ని కొలతలు వేసి తమకు అప్పగించారని వివరించారు. 2017లో హైకోర్టు ఆదేశాల ఆధారంగా తమ పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, అందులో ఎలాంటి అక్రమం లేదని స్పష్టం చేశారు. మా వద్ద అన్ని చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయని, కోర్టు ఆదేశాలను ఆధారంగా చేసుకొని మాత్రమే రిజిస్ట్రేషన్ జరిగిం దన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ అంటూ ప్రచారం చేయడం పూర్తిగా తప్పుడు ఆరోపణ అని వారు పేర్కొన్నారు. ఇటీవల కొందరు వ్యక్తులు తమపై అసత్య ప్రచారం చేస్తూ, భూమిని ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. కోర్టు తీర్పులను ధిక్కరిస్తూ తమపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు ప్రారం భించామని తెలిపారు. మా మీద ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే, భయభ్రాంతులకు గురి చేస్తే వారిపై కఠిన లీగల్ యాక్షన్ తీసుకుంటాం అని స్పష్టం చేశారు. ఈ వివాదం నేపథ్యంలో చెల్లూరు గ్రామంలో పాఠశాల భూమి అంశం మరింత చర్చనీయాంశంగా మారగా, వాస్తవ పరిస్థితులపై అధికారుల సమగ్ర విచారణ అవసర మని గ్రామస్తులు భావిస్తున్నారు.



# మార్కెట్ డైరెక్టర్ మాధవరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే





**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా రేణిగుంట మండలం తిమ్మయ్యగుంట గ్రామంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుదీర్ సుధీర్ రెడ్డి పర్యటించారు. శ్రీకాళహస్తి మార్కెట్ డైరెక్టర్ మాధవరెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో, ఆయనను పరామర్శించేందుకు ఎమ్మెల్యే స్వయంగా మాధవరెడ్డి నివాసానికి చేరుకున్నారు. మాధవరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా మాధవరెడ్డి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, పార్టీ పరంగాను వ్యక్తిగతం గాను అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మార్కెట్ చైర్మన్ చెంచయ్య నాయుడు, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ భాష, కరకంబాడి క్లస్టర్ ఇంచార్జ్ టీడీపీ సీనియర్ నాయకులు బుజ్జి రెడ్డి పాల్గొన్నారు. అలాగే అన్నాస్వామి పల్లి టీడీపీ సీనియర్ నాయకులు ముచ్చెలి భాస్కర్ రెడ్డి, అన్నాస్వామి పల్లి గ్రామ కమిటీ సీనియర్ నాయకులు కాపీ రెడ్డి నాదమునిరెడ్డి, వెంకట మునిరెడ్డి, చెంచయ్య, చంద్రయ్య యాదవ్, జనార్దన్ రెడ్డి, రాజేంద్ర, చెంగల్ రాయలు, వీరేంద్ర రెడ్డి, మోహన్ రెడ్డి, వెంకటాపురం చందు తదితరులు పాల్గొన్నారు. రేణిగుంట మండల పట్టణ అధ్యక్షులతో పాటు పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ పరామర్శ కార్యక్రమంలో పాల్గొని మాధవరెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ అభివృద్ధిలోనూ, పార్టీ బలోపేతంలోనూ చురుగ్గా వ్యవహరించే నాయకులకు అండగా ఉండడం తన బాధ్యతని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సంపాదకీయం

## నారీశక్తి కోసం నిలబడాల్సిన తరుణం!

మరికొన్ని రోజుల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో పండుగల సందడి మొదలవబోతున్నది. అస్సాం ప్రజలు రొంగాలి బిహు జరుపుకొంటే, ఒడిశా ప్రజలు మహా బిషుబ పాన సంక్రాంతి జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్లో పాయిలా బైశాఖ్ బెంగాలీల నూతన సంవత్సరానికి నాంది పలికితే, కేరళలో విషు పండుగను సంబరంగా చేసుకుంటారు. తమిళనాడులో పుత్తాండు పర్వదినాన్ని, పంజాబ్‌తోపాటు ఉత్తర భారతంలోని ఇతర ప్రాంతాల్లో బైశాఖీ వేడుకను చేసుకుంటారు. ఇవన్నీ ఆశాభావాన్ని, సానుకూల దృక్పథాన్ని పెంపొందించే పండుగలు. దేశవిదేశాల్లో ఈ పండుగలు జరుపుకొనే వారందరికీ నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ పవిత్ర వేడుకలు అందరి జీవితాల్లో ఆనందాన్నీ, సౌభాగ్యాన్నీ తీసుకురావాలని కోరుకుంటున్నాను. వీటితోపాటు, ఏప్రిల్ 11 నుంచి మహాత్మా పూలే 200 జయంతి ఉత్సవాలు కూడా మొదలవుతున్నాయి. ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా యావత్ భారతదేశం ఆయనకు నివాళి అర్పించబోతున్నది. మన మనసులనూ, ఆలోచనలనూ నూతన స్ఫూర్తితో నింపివేసే ఈ ప్రత్యేక సందర్భాలతోపాటు, మన దేశం మరో చరిత్రాత్మక సందర్భానికి సిద్ధమవుతున్నది. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్టం చేయడానికి, సమానత్వం పట్ల మన నిబద్ధతను నొక్కి చెప్పడానికి లభించిన గొప్ప అవకాశమిది. మహిళల రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించేందుకు, ఆమోదించేందుకు ఏప్రిల్ 16న పార్లమెంటు సమావేశమవుతున్నది. దీనిని ఓ శాసన సంబంధమైన కార్యక్రమంగా భావిస్తే ఈ బిల్లు ప్రాధాన్యాన్ని తగ్గించినట్టే! దేశంలోని కోట్లాది మంది మహిళల ఆకాంక్షలకు ఇది ప్రతిబింబం. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనం. మన దేశ జనాభాలో దాదాపు సగం మంది మహిళలే ఉన్నారు. వారు ఈ దేశానికి అందిస్తున్న సేవలు అపారం, అమూల్యం. ప్రతి రంగంలోనూ మహిళలు సాధిస్తున్న అద్భుతమైన విజయాలకు దేశమంతా గర్వపడుతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగాలు మొదలుకొని ఔత్సాహిక పారిశ్రామిక రంగం వరకు, క్రీడల నుంచి రక్షణ బలగాల వరకు, సంగీతం నుంచి కళల వరకు దేశాభివృద్ధిలో మహిళలు ఎంతో కీలకంగా ఉన్నారు. గత కొన్నేళ్లుగా స్థిరంగా కొనసాగుతున్న అనేక ప్రయత్నాల వల్ల మహిళా సాధికారతకు సానుకూలమైన వాతావరణం ఏర్పడింది. చదువుకునేందుకు అవకాశాలు విస్తృతం కావటం, ఆరోగ్యసేవలు మెరుగుపడటం, సంపద సృష్టిలో సమాన భాగస్వామ్యం, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావటం... ఈ మార్పుల వల్ల ఆర్థిక, సామాజిక జీవితాల్లో మహిళల వంతు పెరిగింది. కానీ, సమాజంలో పెరుగుతున్న ఈ మహిళా భాగస్వామ్యానికి అనుగుణంగా రాజకీయ రంగంలోనూ, శాసనసభల్లోనూ వారి ప్రాతినిధ్యం పెరగలేదు. ఇది ఎంతో దురదృష్టకరం, ఎందుకంటే-- పాలనలోనూ, నిర్ణయాధికారంలోనూ మహిళలు పాలుపంచుకొన్నప్పుడు వారిదైన ఆలోచనలతోనూ, అనుభవాలతోనూ సామాజిక చర్చలు మరింత నిశితమవుతాయి, పాలనా సామర్థ్యం మరింత బాగుపడుతుంది. 2029లో లోక్‌సభకు, వివిధ రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగే నాటికల్లా మహిళా రిజర్వేషన్లు అమలులోకి రావటం అనివార్యం. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు దక్కాల్సిన ప్రాధాన్యాన్ని దక్కేలా చేసేందుకు గత ప్రభుత్వాలు దశాబ్దాలుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. కమిటీలు ఏర్పాటయ్యాయి. ముసాయిదా బిల్లులను ప్రవేశపెట్టారు. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ, చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉంది. ఈ ఏకాభిప్రాయ స్ఫూర్తితోనే 2023 సెప్టెంబరులో నారీ శక్తి వందన్ అధినియమ్‌ను పార్లమెంటు ఆమోదించింది. నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన సందర్భాల్లో ఒకటిగా నేను దీన్ని భావిస్తాను. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. సమానత్వం అత్యున్నత విలువగా ఉన్న సమాజాన్ని నిర్మించాలని మన రాజ్యాంగ నిర్మాతలు, ముఖ్యంగా రాజ్యాంగ పరిషత్తులోని మహిళా సభ్యులు, ఆకాంక్షించారు. శాసన వ్యవస్థల్లో మహిళల పాత్రను బలోపేతం చేయడమన్నది ఈ ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఒక కీలకమైన ముందడుగు. దేశ భవిష్యత్తును మలచడంలో ప్రతి పౌరుడికీ సమానమైన అవకాశముండే సమాజాన్ని ఏర్పాటు చేసే దిశగా మా చిత్తశుద్ధికి ఇది తార్కాణం. ఇది ఇక ఎంతమాత్రమూ వాయిదా వేసేందుకు వీల్లేని విషయం. మహిళల సమాన ప్రాతినిధ్యాన్ని బలపరచటంలో జరిగే ఏ ఆలస్యమైనా, అది మన ప్రజాస్వామ్యాన్ని సమానత్వ స్ఫూర్తి దిశగా తీసుకువెళ్ళటంలో జరిగే ఆలస్యం కిందే లెక్క! శాసన వ్యవస్థల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని దశాబ్దాల క్రితమే గుర్తించారు, దానిపై చర్చలు జరిపారు, అది తప్పనిసరి కర్తవ్యంగా నిర్ధారించారు. ఇప్పుడు ఇంకా ఈ విషయంపై ఒక చర్య తీసుకోవటంలో ఆలస్యం జరిగితే, మనం ఇప్పటికే గుర్తించిన, సరిదిద్దగలిగిన వివక్షను మరింతకాలం కొనసాగించినట్టే అవుతుంది. మన దేశం ఒక నిర్దిష్ట లక్ష్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగు వేస్తున్న ఈ తరుణంలో, దేశంలోని అన్ని వ్యవస్థలూ ఇక్కడి సమస్త పౌరుల, ముఖ్యంగా జనాభాలో సగభాగంగా ఉన్న మహిళల, ఆకాంక్షలను ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు తక్షణం ఈ చర్య చేపట్టడం వల్ల ఎంతోకాలంగా పూచీపడి ఉన్న వాగ్దానాలు నెరవేరడమే కాదు, అభివృద్ధి వైపు సాగుతున్న వేగం కూడా నెమ్మదించకుండా అలాగే కొనసాగుతుంది. మన ప్రజాస్వామ్యాన్ని మరింత సమాన ప్రాతినిధ్యం కల్పించేదిగా, స్పందించేదిగా, భవిష్యత్తుకు అనుగుణమైనదిగా తీర్చిదిద్దేందుకు ఇది ఒక చరిత్రాత్మకమైన అవకాశం.

# పశ్చిమాసియా యుద్ధం ఆగాలని వాసుపల్లి అర్ధరాత్రి శాంతియాత్ర

### - కనకమహాలక్ష్మి టెంపుల్ నుండి వినాయక ఆలయం వరకు పాదయాత్ర






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా – ఇరాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అమెరికా మంగళవారం రాత్రి దేశాన్ని తుడిచిపెడతానని బెదిరించడం విచారకర్మన్నారు. ఆయన నిర్ణయంలో మార్పు రావాలని కోరుతూ వాసుపల్లి గణేష్ కుమార్ మంగళవారం రాత్రి పాత నగరం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కొబ్బరికాయ కొట్టి ఆసీలమెట్ట శ్రీ సంపత్ వినాయక ఆలయం వరకు చెప్పులు లేకుండా కాలినడకన వైసిపి శ్రేణులతో కలిసి శాంతియాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ ఒక దేశాన్ని నాశనం చేయడం అంటే అది ప్రపంచ వినాశనమే అని చెప్పారు. తమ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని ఇతర దేశాలను బెదిరిస్తూ అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుందని మండిపడ్డారు. రష్యా దగ్గర అమెరికా గంట ఎక్కువ అణ్వాయుధాలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలిపారు. అలాగే చైనా వద్ద కూడా ఉన్నాయని చెప్పారు. అణుయుద్ధం అంటూ వస్తే ప్రపంచం వినాశనమవుతుందని పేర్కొన్నారు. ఇరాన్ తమ షరతులకు ఒప్పుకోకపోతే ఆ దేశంపై అణు దాడి చేస్తామని బెదిరించడం దారుణమన్నారు. ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకొని ఈ యుద్ధాన్ని ఆపాలని కోరుతూ తాను ఈ పాదయాత్ర చేస్తున్నట్లు వాసుపల్లి వెల్లడించారు.

**పది రోజుల కాల్పులు విరమణ..**

మంగళవారం రాత్రి వాసుపల్లి గణేష్ కుమార్ ట్రంప్ నిర్ణయంలో మార్పు రావాలని కోరుతూ చేసిన పాదయాత్ర ఫలించిందని వైసీపీ క్యాడర్ సంతోషం వ్యక్తం చేసింది. బుధవారం ఉదయం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ పై దాడి చేసే ప్రయత్నాన్ని విరమించుకుని పది రోజుల కాల్పుల విరమణ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేయడం జరిగింది. భవిష్యత్తులో ఈ యుద్ధం ఒక ముగింపు రావాలని ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు.

ప్రపంచంలో శాంతి నెలకొనేలా ప్రపంచ దేశాధినేతలు అందరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా జనరల్ సెక్రటరీ గనగల రామరాజు, వార్డ్ ప్రెసిడెంట్స్ పీతల వాసు, ముజీబ్ ఖాన్, జిల్లా ఆర్‌టిఐ సెక్రెటరీ ఆరుగుల రాజు, జిల్లా యూత్ జనరల్ సెక్రెటరీ చంద్రమౌళి, సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు బాబ్జి, దైవ కుమార్, వీటి కృష్ణ కుమార్, వార్డ్ యూత్ ప్రెసిడెంట్లు చేపల నూకరాజు బూరెల చిన్న, లోకేష్, ఉదయ్, మౌళి తదితరులు పాల్గొన్నారు.

# కేజీహెచ్ భావనగర్ వార్డ్ ఎదురుగా "గాటోస్ కేఫ్" రెస్టారెంట్ ప్రారంభం

### - ముఖ్యఅతిథిగా ప్రారంభించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో విశాఖ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్డిఏ) ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కేజీహెచ్ భావనగర్ వార్డ్ ఎదురుగా "గాటోస్ కేఫ్" రెస్టారెంట్‌ను విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సిహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా, రాష్ట్ర ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ప్రత్యేక అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే ధ్యేయంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అద్వర్యంలో విశాఖ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్డిఏ) ద్వారా అనేక వినూత్న కార్యక్రమాలు స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా అమలు చేయబడుతున్నాయన్నారు. అందులో భాగంగా స్వయం సహాయక సంఘ సభ్యులను ప్రోత్సహించి వారిని పారిశ్రామి కవేత్తలుగా తీర్చిదిద్దడంతో జరుగుతోందన్నారు. అలాగే ఒక మహిళా పారిశ్రామికవేత్త మరికొంతమందికి ఉపాధి కల్పించేలా అభివృద్ధి చెందే విధంగా అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఈ లక్ష్యాన్ని సాధించేందుకు జిల్లా గ్రామీణాభి వృద్ధి సంస్థ, "గాటోస్ కేఫ్" అరకు కాఫీ కేఫ్, మిల్లెట్ కేఫ్ వంటి ఆహార కేంద్రాలను ఏర్పాటు చేయడానికి జిల్లా సమాఖ్య అద్వర్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులకు సహకారం అందిస్తూ, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నట్లు పేర్కొన్నారు. పెందుర్తి మండలం శివరామ గ్రామీణ స్వయం సహాయక సంఘ సభ్యురాలు బైలపూడి లక్ష్మి అనే ఒక మహిళా పారిశ్రామికవేత్త ఈ కేఫే నిర్వహిస్తారని తెలిపారు. కేజీహెచ్‌లో ఈ రెస్టారెంట్లో ఉదయం కాఫీ, టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం మాక్టయిల్ డ్రింక్స్ అందుబాటులో ఉంటాయన్నారు. కేజీ ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు సరసమైన ధరలకు, శుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించడం ఈ కేఫే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. దీన్ని ఏర్పాటు చేయడానికి సహకరించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణికి ఎమ్మెల్యే వంశీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ జిల్లా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. లక్ష్మీపతి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ రమణ, జిల్లా సమాఖ్య ఓబి సభ్యులు, డిఆర్డిఏ సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# వావిల్ల జడ్పీ హై స్కూల్లో ఘనంగా సుందరాచారి వర్ధంతి






**విడవలూరు/వావిళ్ళ (రాజధాని వార్తలు):** మా తెలుగు తల్లికి మల్లెపూదండ గేయ రచయిత కీ.శే. శంకరంబాడి సుందరాచారి వర్ధంతి సందర్భంగా బుధవారం పియం శ్రీ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, వావిళ్ళ విడవలూరు మండలం నందు శంకరంబాడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన, మా తెలుగు తల్లికి మల్లె పూదండ విశిష్టతలను ప్రధానోపాధ్యాయులు వై.చెంచురామయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పిల్లల దంత ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

### - ఘనంగా ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** చిన్నారుల్లో పాల పళ్ల వయసులోనే వారి దంత సమస్యలను గుర్తించి జాగ్రత్త చర్యలు పాటిస్తే దంతాల శాశ్వతంగా ఆరోగ్యంగా ఉంటాయని సామర్ల కోట ప్రభుత్వాసుపత్రి దంత వైద్య నిపుణులు డా.ప్రవీణ అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సామర్లకోట పట్టణం పెన్షన్ లైన్ అంగన్వాడీ కేంద్రంలో దంత సమస్యలపై చిన్నారులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ మాట్లాడుతూ మార్చి 20వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నట్టు చెప్పారు. కాగా తల్లిదండ్రులు చిన్నారుల్లో ఉండే దంత సమస్యలను ముందుగానే గుర్తించాలన్నారు. దాని ద్వారా పిల్లల పాల పళ్ళు కూడిన తర్వాత వచ్చే దంతాల విషయంలో ఖాళీలు తలెత్తకుండా దంత వైద్యులను సంప్రదించి జాగ్రత్త పడితే దంతాలు పటిష్టంగా ఉండి, చిగుళ్ల సమస్య ఎదురు కాకుండా ఉంటుందన్నారు. ఈ సం దర్భంగా చిన్నారుల దంత సమస్యలకు సంబంధించి ప్రత్యేక టూత్ బ్రష్‌లు, పేస్టులు ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు, చిన్నారులు వారి తల్లులు పాల్గొన్నారు.

# అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే పంతం నానాజీ

### - సర్పవరం గ్రామంలో రూ.74 లక్షలతో రోడ్ల ప్రారంభోత్సవం



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా ముందుకు తీసుకెళ్తోందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో సుమారు రూ.100 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేసినట్లు ఆయన వెల్లడించారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ నిధులతో రూ.74 లక్షల వ్యయంతో పోస్టల్ కాలనీ, భవన్ నారాయణపురం ప్రాంతాల్లో 9 రోడ్లు మరియు ఒక డ్రైన్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మార్గదర్శకత్వంలో గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపర్చడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఢీఓ సతీష్, కూటమి నాయకులు పెంకె శ్రీనివాస్ బాబా, రంబాల వెంకటేశ్వరరావు, పుల్ల శ్రీరాములు, పుల్లా వీరబాబు, పుల్ల కోటేశ్వరరావు, నందిపాటి త్రిమూర్తులు, బన్ను, బొళ్ళ కృష్ణమోహన్, కార్యదర్శి పబ్బినేడి శ్రీనివాసరావు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



**గూడూరు, (రాజధాని వార్తలు):** సినీ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టిన రోజును సందర్భంగా గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వృద్ధుల సమక్షంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ని కట్ చేసి బుద్ధులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అల్లు అర్జున్ అభిమాని చిట్టమూరు శ్రీనివాసులు మాట్లాడుతూ హీరో అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రతి సంవత్సరం అనేక కార్యక్రమాల నిర్వహిస్తామని వృద్ధులందరూ అల్లు అర్జున్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుభాష్, ఆర్య, తరుణ్, వెంకీ, సుబ్బు, తదితరులు పాల్గొన్నారు.

# మల్టీస్టారర్‌లో 'హీరో' ఎవరు? మమ్ముట్టి ఆన్సర్ ఏంటంటే?



మల్టీస్టారర్ సినిమాల్లో హీరో ఎవరన్న చర్చ ఎప్పటికీ నిలిచిపోదు. అయితే ఆ ప్రశ్నకు మాలీవుడ్ మెగాస్టార్ మమ్ముట్టి ఇచ్చిన సమాధానం ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారింది. "ఇలాంటి సినిమాల్లో హీరో ఎవరన్నది ముఖ్యం కాదు, కథే అసలు హీరో" అంటూ ఆయన చెప్పిన మాటలు ప్రస్తుతం చక్కర్లు కొడుతున్నాయి. రీసెంట్‌గా ఒక ఇంటర్వ్యూలో యాంకర్.. కోలీవుడ్ దిగ్గజాలు రజనీకాంత్ – కమల్ హాసన్ కాంబినేషన్‌లో వస్తున్న KH x RK గ్లింప్స్‌ను ప్రస్తావిస్తూ ప్రశ్నించారు. అందులో ఇద్దరు "ఎవరు హీరో?" అని దర్శకుడిని అడిగే సన్నివేశం గురించి ప్రస్తావించి, మీరు మోహన్ లాల్‌తో కలిసి నటించినప్పుడు అలాంటి సందేహం వచ్చిందా అని అడిగారు. దీనికి స్పందించిన మమ్ముట్టి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించారు. "మేమిద్దరం కలిసి నటించినప్పుడు కథే ప్రధానంగా ఉంటుంది. మేం ఆ కథలో పాత్రలు మాత్రమే. ఎవరు హీరో అన్న భావన మాకు ఉండదు" అని అన్నారు. తమ మధ్య ఎలాంటి ఇగోలు లేవని, ఒకరి సినిమాల్లో మరొకరు నటించడం చాలా సహజమని కూడా తెలిపారు. మమ్ముట్టి ఇంకా మాట్లాడుతూ, "నేను మోహన్ లాల్ సినిమాల్లో నటించాను, ఆయన కూడా నా సినిమాల్లో నటించారు. మేం ఎప్పుడూ ఎవరు ఎక్కువ, ఎవరు తక్కువ అనే ఆలోచన పెట్టుకోం. మంచి కథ ఉంటే కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంటాం" అని చెప్పారు. ఆయన వ్యాఖ్యలు మల్టీస్టారర్ సినిమాలపై ఉన్న అభిప్రాయాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు. ఇదిలా ఉంటే, సౌత్‌లో అరుదైన కాంబినేషన్‌గా భావిస్తున్న రజనీకాంత్ – కమల్ హాసన్ సినిమా ఇప్పటికే భారీ అంచనాలు సృష్టిస్తోంది. KHxRK అనే వర్కింగ్ టైటిల్‌తో ఇటీవల విడుదలైన గ్లింప్స్ అభిమానులను ఆకట్టుకుంది. ఆ చిత్రానికి జైలర్ ఫేమ్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. గ్లింప్స్‌లో రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ స్టైలిష్‌గా కనిపిస్తూ పోటాపోటీగా నిలిచారు. రజనీకాంత్ కారు కీ ఇవ్వడం, కమల్ హాసన్ డ్రైవింగ్ సీట్‌లో కూర్చోవడం వంటి షాట్స్ అభిమానులను ఆకట్టుకున్నాయి. చివర్లో "ఎవరు హీరో?" అనే ప్రశ్న సినిమాపై ఆసక్తి మరింత పెంచింది. మమ్ముట్టి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో చూస్తే, ఆ ప్రశ్నకు సమాధానం ముందు స్పష్టంగా ఉందని చెప్పాలి. కథే ప్రధానంగా ఉండే ఇలాంటి చిత్రాల్లో నటీనటుల కంటే కంటెంట్‌కే ప్రాధాన్యం ఉంటుందని ఆయన అభిప్రాయం. ఇదే విధానం కమల్ హాసన్ – రజనీకాంత్ ప్రాజెక్ట్‌లో కూడా కనిపించే అవకాశం ఉంది. మొత్తంగా.. ఇద్దరు లెజెండ్స్ కలిసి నటిస్తున్న సినిమా కథ ఆధారంగా ముందుకు సాగుతుందన్న సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి.

# సమంత ఒక్కరోజు కూడా వదిలి ఉండలేదట!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో కలిసి సమంత నటించిన ఫ్యామిలీ రొమాంటిక్ డ్రామా ఖుషి. ఈ మూవీ తరువాత వ్యక్తిగత సమస్యల కారణంగా కాస్త బ్రేక్ తీసుకున్న సమంత ప్రొడ్యూసర్‌గా, నటిగా మళ్లీ రెట్టించిన ఉత్సాహంతో సినిమాలు చేయడం మొదలు పెట్టింది. నాగచైతన్యతో విడాకుల అనంతరం కొంత మానసిక ఒత్తిడికి గురైన సమంతా ఆ తరువాత ది ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ డైరెక్టర్లలో ఒకరైన రాజ్ నిడియోరుని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. ఆయన సహకారంతో నిర్మాణ సంస్థని స్థాపించి చిన్న సినిమాలకు నిర్మాతగా సమంత శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబర్ 1న దర్శకుడు రాజ్ నిడిమోరుని వివాహం చేసుకన్న సామ్ కొత్త లైవ్‌ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే భర్త రాజ్ నిడిమోరుపై తన ప్రేమని వ్యక్తం చేసిన సమంత తాజాగా ఆసక్తికరంగా స్పందించింది. రాజ్‌తో భావోద్వేగ భద్రతను, నమ్మకాన్ని పొందానని వెల్లడించింది. అంతే కాకుండా తాజాగా మరింత ఆసక్తికరంగా స్పందించి ఆశ్యర్యపరుస్తోంది. నా జీవితంలో ఇన్ని సంఘటనలు జరిగిన తరువాత కూడా నేను ఒక మంచి మనిషిగా, ఒక ఉత్తమ నటిగా ఎదగడానికి కారణం నా భర్త రాజే అంటూ స్పష్టం చేసింది. మేము ప్రతి పనిని కలిసే చేస్తాము. పని, వినోదం, వ్యాయామం కూడా. ఒక్క రోజు కూడా నేను అతనికి దూరంగా ఉండలేను అంటూ ఇటీవల ఓ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.

తన వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదలకు తన జీవిత భాగస్వామి ఏ స్థాయిలో కీలక పాత్ర పోషించారో వివరిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది సమంత. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే శుభంలో చిన్న అతిథి పాత్రలో మెరిసిన సమంత పూర్తి స్థాయి క్యారెక్టర్‌లో సోలో మూవీతో మూడేళ్ల విరామం తరువాత ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆమె నటించిన తాజా ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామా మా ఇంటి బంగారం. రాజ్ నిడియోరు షో రన్నర్‌గా, సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ మూవీకి నందిని రెడ్డి దర్శకురాలు. ఫ్యామిలీ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా మే 15న భారీ స్థాయిలో రిలీజ్ కాబోతోంది. గుల్షన్ దేవయ్య, దిగాంత్ కీలక పాత్రల్లో నటించారు.

# నేహా శర్మ అందాల విందు.. ఫ్యాన్స్ ఫిదా



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన 'చిరుత' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన నేహా శర్మ, తన గ్లామర్‌తో మరో సారి సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. వయసు పెరుగుతున్నా కొద్దీ తన ఫిట్‌నెస్‌తో మరింత యంగ్‌గా, ఆకర్షణీయంగా కనిపిస్తూ కుర్రకారును మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ ఫోటోలతో పాటు ఆమె ఇచ్చిన క్రేజీ క్యాప్షన్ కూడా అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటూ వైరల్ అవుతోంది. ఆ విశేషాలు చూద్దాం.. నేహా శర్మ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలలో చాలా బోల్డ్‌గా కనిపిస్తోంది. ఆమె ధరించిన వెస్ట్రన్ డ్రెస్ తన గ్లామర్‌ను మరింత ఎలివేట్ చేస్తోంది. ముఖ్యంగా తన టోన్డ్ లెగ్స్ కనిపించేలా ఆమె ఇచ్చిన స్టిల్స్ నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. ఈ ఫోటోలకు ఆమె "వైల్డ్లీ డెల్యూషనల్.. అండ్ ఐ లైక్ ఇట్ లైక్ దట్" అంటూ ఒక ఆసక్తికరమైన క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే వేల సంఖ్యలో లైకులు, కామెంట్లు వచ్చి చేరాయి. ఆమె స్టైలింగ్ చూస్తుంటే ఫ్యాషన్ విషయంలో నేహాకు సాటి ఎవరూ లేరనిపిస్తోంది. తెలుగు ప్రేక్షకులకు నేహా శర్మ అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'చిరుత' సినిమాతో ఆమె కెరీర్ గ్రాండ్‌గా మొదలైంది. ఇక మొదటి సినిమాతోనే తన అందం మరియు అభినయంతో తెలుగు వారి మనసు గెలుచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ అక్కడ బిజీ హీరోయిన్‌గా మారిపోయింది. హిందీలో పలు సూపర్ హిట్ చిత్రాల్లో నటించినప్పటికీ, ఇప్పటికీ ఆమె తెలుగు సినిమాల్లో కనిపిస్తే చూడాలని మన ఆడియన్స్ కోరుకుంటూనే ఉంటారు. నేహా శర్మ ఇంత గ్లామరస్‌గా ఉండటానికి ప్రధాన కారణం ఆమె క్రమం తప్పకుండా చేసే వర్కవుట్స్. ఆమె ఒక కంప్లీట్ ఫిట్‌నెస్ ఫ్రీక్ అని చెప్పవచ్చు. ఇక ఆమె జిమ్‌లో కష్టపడుతున్న వీడియోలను, యోగా చేస్తున్న ఫోటోలను తరచుగా తన అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఇక సరైన ఆహారం, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి వల్లే ఆమె తన బాడీని ఇంత పర్ఫెక్ట్‌గా మెయింటైన్ చేస్తోంది. అందుకే బీచ్ ఫోటోలైనా, స్టైలిష్ మోడ్రన్ డ్రెస్సులైనా నేహాకు చాలా చక్కగా నప్పుతాయి. ప్రస్తుతం సోషల్ మీడియాలో నేహా శర్మకు ఉన్న ఫాలోయింగ్ చూస్తుంటే ఆమె ఒక గ్లామర్ క్వీన్ అని ఒప్పుకోక తప్పదు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరియు బోల్డ్ ఫోటోషూట్‌లతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటోంది.

# ఇండస్ట్రీలో హీరో పేర్లపై నటుడి హాట్ కామెంట్స్!



ఇండియాపై ఇండియన్ పొలిటీషయన్స్ చేస్తున్న కుట్రలకు చెలించిపోయిన అజయ్ సన్యాల్ దీనిపై ధురంధర్‌లో ఓ డైలాగ్ చెబుతాడు. హిందుస్థానియోంకా సబ్‌సే బడా దుష్మన్ హిందుస్థానీ హై పాకిస్థాన్‌తో దూస్రా నంబర్‌పర్ ఆతీహై.. భారతీయులకు అతి పెద్ద శత్రువు భారతీయుడే..పాకిస్థాన్ ఆ తరువాత స్థానంలో ఉంటుందని..ఇక్కడ కొంతమంది మాటలు వింటే అదే నిజమనిపిస్తోందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా సెలబ్రిటీలు మైక్ పట్టుకుంటే చాలు కాంట్రవర్సీలు మాట్లాడేస్తూ వైరల్ అయిపోతున్నారు. ఆ తరువాత నెటిజన్‌లు, కోర్టులు చీవాట్లు పెట్టడంతో సైలెంట్ అయిపోయి తమ పని తాము చేసుకుంటున్నారు. తాజాగా ఓ నటుడు ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలే చేసి నెట్టింట ట్రెండ్ అవుతున్నాడు తననే కమల్ కామరాజు. దర్శకుడు చంద్రశేఖర్ ఏలేటి రూపొందించిన అనుకోకుండా ఒక రోజు సినిమాతో నటుడిగా కెరీర్ ప్రారంభించిన కమల్ కామరాజు ..జక్కన్న ప్రభాస్‌ల ఛత్రపతి, శేఖర్ కమ్ముల సుమంత్‌ల గోదావరి సినిమాలతో మంచి పేరు తెచ్చుకున్నాడు. అనీష్ కురువిల్ల ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేసిన ఆవకాయ బిర్యాని సినిమాతో హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ప్రయత్నించినా ఫలించకపోవడంతో అప్పటి నుంచి హీరో ఫ్రెండ్, సపోర్టింగ్ క్యారెక్టర్లు చేస్తూ వస్తున్నాడు. రీసెంట్‌గా పవన్ కల్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్‌సింగ్ మూవీలో కమల్ అనే ఆఫీసర్ క్యారెక్టర్‌లో నటించాడు. తాజాగా ఓ పోడ్ కాస్ట్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కమల్ కామరాజు మాట్లాడుతూ తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోలకి మస్లీం పేర్లు ఎందుకు పెట్టరు దీని గురించి ఎప్పుడైనా ఆలోచించారా అంటూ కీలక వ్యాఖ్యలు చేశాడు.

# “శుభ్రత “కొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిన జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర్ రెడ్డి






**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** గ్రామాల్లో చెత్త కనిపించరాదు. మురుగునీటి నిల్వలు ఉండరాదు. ఇంటింటికీ సోక్ పిట్స్ కట్టించడం లక్ష్యం. మరుగుదొడ్డి లేని గృహం ఉండరాదు. ఆరుబయట మల విసర్జన చేసే వారికి జరిమానా విధించాలి. కాలపరిమితి లోగా సీసీ రోడ్లు పాడైతే సమాచారం అందించాలి. వేసవిలో మంచి నీళ్ల ట్యాంకర్ అవసరం రాకూడదు. జలధార, జలహారతి కింద చెరువులు శుభ్రం, పరిరక్షణ. రైతన్నా మీకోసం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలి. “మన మిత్ర”వాట్సాప్ అప్లికేషన్‌ను ప్రతి పౌరుడు వినియోగించుకోవాలి. గ్రామ స్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కారం కావాలి. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రాధాన్యత. గ్రామ శ్రేయోభిలాషులుగా ప్రభుత్వ అధికారులు. జిల్లాలోని గ్రామాలన్నింటినీ పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ‘శుభ్రత’ అనే వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి నిర్ణయించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల రూపురేఖలను మార్చడమే కాకుండా, ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ పారిశుధ్య కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువత, మహిళా సంఘాలు మరియు పెన్షనర్లు ఇలా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలువునిచ్చారు. తద్వారా గ్రామాల్లో చెత్త ఎక్కడా కనిపించరాదని, అయినప్పటికీ చెత్త కనిపిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమీపంలోని చర్చి వీధిలో గల సామాజిక భవనంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పం ఉంటే అభివృద్ధిని ఎవ్వరూ అడ్డుకోలేరని తెలిపారు. ఐదు లేదా ఆరు గ్రామాలను ఒక క్లస్టర్‌గా విభజించి, అన్ని గ్రామాల పారిశుధ్య కార్మికులను మరియు వనరులను ఒకే గ్రామంలో కేంద్రీకరించి పూర్తిస్థాయిలో క్లీనింగ్ చేయించాలని అన్నారు. ఈ డ్రైవ్‌ను ఒక వారం రోజుల పాటు నిర్వహించి, ప్రణాళికాబద్ధంగా గ్రామాలన్నింటినీ శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. చెత్తను పడితే అక్కడ వేయడం తప్పని, గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని చాటిచెప్పేలా బ్యానర్లు మరియు సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. కేవలం పారిశుధ్య కార్మికులే కాకుండా ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ గ్రామాన్ని తామే శుభ్రం చేసుకోవాలని కోరారు. పది మందికి సహాయం చేయడంలోనూ, వృత్తిని బాధ్యతగా నిర్వహించడంలోనూ లభించే తృప్తి ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఎక్కడా చెత్తాచెదారం కనిపించకూడదని కలెక్టర్ ఆదేశించారు. ఇది ప్రతి అధికారి కనీస బాధ్యత అని, అభివృద్ధి పనుల్లో విఫలమైన వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. “మంచిగా చెప్పే సమయం అయిపోయిందని, ఇక చర్యలే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. వచ్చే సోమవారం నుండి స్పెషల్ ఆఫీసర్లు ప్రతిరోజూ తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించాలి. అక్కడి పరిస్థితులను వీడియోలు తీసి ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను నేరుగా తన మొబైల్ నంబర్‌కు మెసేజ్ ద్వారా పంపవచ్చని కలెక్టర్ తెలిపారు. ఇంటింటికీ సోక్ పిట్స్ కట్టించడం లక్ష్యంఓ కావాలని, అదేవిధంగా మరుగుదొడ్డి లేని గృహం ఉండరాదని స్పష్టం చేశారు. ఉన్న మరుగుదొడ్లను వినియోగించుకోవడంతో ఆటు అవసరమైన గృహాలకు, పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు కొత్తగా మంజూరుచేస్తామన్నారు. గ్రామాల్లో ఆరుబయట మల విసర్జన చేసే వారికి జరిమానా విధించాలని, అటువంటి వారిని అవగాహన కల్పించి మరుగుదొడ్లను వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సీసీ రోడ్ల కాలపరిమితి 30 ఏళ్లు అని, ఈలోగా సీసీ రోడ్లు పాడైతే సమాచారం అందించాలని అన్నారు. తద్వారా సంబంధిత కాంట్రాకర్లతో ప్యాచ్ వర్కులు చేయించాలని, చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించారు. జిల్లాలో భూగర్భ జలవనరులు పుష్కలంగా ఉన్నాయని, అందువలన వేసవిలో ఎక్కడా నీటి సమస్యలు తలెత్తరాదని, మంచి నీళ్ల ట్యాంకర్ అవసరం రాకూడదని అన్నారు. తాగునీటి సమస్యలను ముందుగానే గుర్తించాలని, బోర్ల వద్ద రీచార్జ్ పిట్స్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలను స్వీకరించేందుకు ప్రతి గురువారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే నిర్వహించాలన్నారు. రెవెన్యూ, పెన్షన్లు మరియు ఇతర పౌర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క సమస్య కూడా గ్రామాన్ని దాటి పైస్థాయికి రాకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో సమస్యలు పరిష్కారం కావడం లేదని భావించే ప్రజల కోసం అవసరమైతే కలెక్టర్ ప్రత్యేకంగా ఫోన్-ఇన్ లేదా వీడియో కాల్ కార్యక్రమాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. బాధితులతో లేదా రైతులతో తానే స్వయంగా మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. సామాన్యుడు తన సమస్య చెప్పుకోవడానికి డబ్బులు ఖర్చు పెట్టుకుని జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని, మీ గ్రామంలోనే మీ సమస్యకు పరిష్కారం లభించాలన్నారు. అధికారుల పనితీరులో మార్పు రాకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సచివాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, వారి సమస్యలను ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసేలా ప్రోత్సహించాలని, దీనికోసం మీకోసం వెబ్‌సైట్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారంతో కూడిన ‘గ్రామ ప్రొఫైల్’ను ఖచ్చితంగా నిర్వహించాలని, అందులో ఇళ్ల సంఖ్య, అందుబాటులో ఉన్న వసతులు వంటి వివరాలు స్పష్టంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తర్వాత వచ్చే పని ఒత్తిడిని అధిగమించడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. విధులను కేవలం బాధ్యతగా కాకుండా, ఇష్టంతో నిర్వహించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. గ్రామస్థాయిలోని వి.ఆర్.ఓ, పంచాయతీ కార్యదర్శులు మరియు ఇతర సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, ప్రతి విన్నపాన్ని సంతృప్తికరంగా పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే చేరవేసే లక్ష్యంతో రూపొందించిన “మన మిత్ర” వాట్సాప్ అప్లికేషన్‌ను ప్రతి పౌరుడు వినియోగించుకునేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పౌరుని మొబైల్‌లో “మన మిత్ర” నంబర్‌ను పిన్’ చేయించాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు కేవలం కంప్యూటర్లకే పరిమితం కాకుండా, ప్రజలందరికీ ఈ యాప్ ద్వారా సేవలు అందేలా సమన్వయం చేయాలని, యాప్ ద్వారా లభించే వందలాది సేవలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించాలని తెలిపారు. జలధార, జలహారతి కింద చెరువులను శుభ్రం చేయడంతో పాటు, ఆక్రమణకు గురైన వాటిని పరిరక్షించాలన్నారు.

రైతన్నా మీకోసం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని, అగ్రికల్చర్ మరియు హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రతి రైతు వద్దకు వెళ్లి వారు సాగు చేస్తున్న పంటల గురించి తెలుసు కోవాలని, సోక్ పిట్స్, హార్వెస్టింగ్ పిట్స్ ఏర్పాటుపై అవగాహన కల్పించడంతో పాటు, రైతులకు లాభదాయకమైన ఉద్యానవన పంటల వైపు మళ్లించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సదస్సులో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్ర రావు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మ్యుటేషన్స్ త్వరగా పూర్తి చేయాలి...పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ వేగంగా జరగాలి : జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్







**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, రీ సర్వే, మ్యుటేషన్స్ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పట్టాదారు పాసు పుస్తకాలు, రీసర్వే, 22 ఏ భూములు, పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్, ఎస్.ఐ.ఆర్, సెన్సస్ తదితర రెవెన్యూ అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం, రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దారులను ఆదేశించారు. ఒక్క తప్పు కూడా లేకుండా పాసుపుస్తకాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా మ్యుటేషన్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే రెవిన్యూ రికార్డులు డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రత్యేకంగా గుర్తించిన గ్రామాల్లో పట్టాదారు పాసుబుక్‌లలో లోపాలు సరిదిద్ది నూరుశాతం తప్పులు లేని పుస్తకాలు భూ యజమానులకు అందించాలని తెలిపారు. పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాలలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కారం చేయాలని, రీ ఓపెన్ అయిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అర్జీదారునితో మాట్లాడాలన్నారు. జాయింట్ ఎల్ పి ఎం సమస్యను జూన్‌లోగా పరిష్కరించాలని, రికార్డులు సరిచేయాలని తెలిపారు. రెవిన్యూ పిటిషన్లుకు సంబంధించి తహశీల్దార్లు వ్యక్తిగతంగా హాజరు కావాలని అన్నారు. రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన పిటీషన్లను పెండింగ్లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, వాట్సప్ గవర్నెన్స్ సేవలు పెరగాలని రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ సవరణ కార్యక్రమానికి సంబంధించి మ్యాపింగ్ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు.

**జిల్లాలో గ్యాస్ కొరత లేదు :**

జిల్లాలో ఎల్ పి జి కొరత లేదని జాయింట్ కలెక్టర్ తెలిపారు. మండల నోడల్ అధికారులుగా తహసీల్దార్‌లు గ్యాస్ ఏజెన్సీలలో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. బుకింగ్ సీరియల్ ప్రకారంగా మాత్రమే గ్యాస్ డెలివరీ చేయాలని, అవకతవకలకు పాల్పడే ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముందుగా బుక్ చేసుకున్న వారికి ముందుగా డెలివరీ ప్రాతిపదికన సిలిండర్లు అందించాలని, ప్రస్తుతం ఏడు రోజుల వ్యవధిలో డెలివరీ జరుగుతున్నదని, అంతకుమించి వెయిటింగ్ ఉన్నవారికి ప్రాధాన్యత ఇచ్చి గ్యాస్ అందించాలని తెలిపారు. పాఠశాలలు సాంఘిక సంక్షేమ, బీసీ వెల్ఫేర్, వసతి గృహాలు మొదలగు వాటికి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ సత్తిబాబు, ఆర్.డి.ఓలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

# విశాఖ రేంజ్ పరిధిలోని జిల్లాల ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్స్‌కు సబ్ ఇన్స్పెక్టర్ పదోన్నతికి ఎంపిక పరీక్షలు







**విశాఖపట్నం (కైలాసగిరి), (రాజధాని వార్తలు):** విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి, ఐపీఎస్ అధ్యక్షతన గత రెండు రోజులుగా జరుగు తున్న హెడ్ కానిస్టేబుల్ మరియు ఏఎస్ఐల ఎస్సై అర్హత పరీక్షలు నేటితో విజయవంతంగా ముగిశాయి. కైలాసగిరిలోని జిల్లా ఆర్మ్ రిజర్వ్ మైదానంలో నిర్వహించిన ఈ పరీక్షల్లో శ్రీకాకుళం, విజ యనగరం, విశాఖపట్నం సిటీ మరియు అనకాపల్లి జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ వృత్తిపరమైన నైపుణ్యాన్ని చాటుకున్నారు. మొదటి రోజు వ్రాత పరీక్షలు పూర్తి చేసుకున్న 45 మంది అభ్యర్థులకు, నేడు అత్యంత కీలకమైన అవుట్-డోర్ మరియు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. పోలీసు క్రమశిక్షణకు అద్దం పట్టే డ్రిల్ ప్రదర్శనతో పాటు, వివిధ రకాల ఆయుధాలను అమ ర్చడం, వాటిని ప్రయోగించే విధానంపై అభ్యర్థుల సామర్థ్యాన్ని బోర్డు సభ్యులు పరిశీలించారు.

**నేర స్థల పరిశీలన**

ఒక నేరం జరిగినప్పుడు క్షేత్రస్థాయిలో సాక్ష్యాధారాలను ఎలా సేకరించాలి, వేలిముద్రలు మరియు పాదముద్రలను శాస్త్రీయంగా ఎలా భద్రపరచాలి అనే అంశాలపై ప్రత్యక్ష పరీక్ష నిర్వహించారు. ఐజీ గోపినాథ్ జట్టి మరియు బోర్డు సభ్యులు అభ్యర్థుల నిర్ణయాత్మక శక్తిని, చట్టాలపై అవగాహనను మౌఖిక పరీక్ష ద్వారా పరీక్షించారు. ఇందులో మూడు నూతన చట్టాల నుండి ప్రశ్నలు అడిగారు. పరీక్షా ప్రక్రియను పర్యవేక్షించిన ఐజీ మాట్లాడుతూ.. “పోలీస్ శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదు, బాధ్యత పెరగడం. నూతన చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం ప్రస్తుత కాలంలో అత్యవసరం” అని పేర్కొన్నారు.

ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారు త్వరలోనే ఎస్సై శిక్షణ నిమిత్తం ఎంపిక కానున్నారని బోర్డు సభ్యులు అనకా పల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ మరియు 16వ బెటాలి యన్ కమాండెంట్ ఎం.అరుణ్ బోస్ తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్లు రామకృష్ణారావు, మన్మధరావు, రేంజ్ కార్యాలయ మేనేజర్ ఎం.బి.సూర్యారావు, ఏఏఓ ఎస్.నాగలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ జి.ఉషాశ్రీ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్తేజం

## - వెంకంపేటలో క్రికెట్, పరుగు పందెం పోటీలు ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** వృత్తిపరమైన బాధ్యతలతో నిత్యం ఒత్తిడితో పనిచేసే ఉద్యోగులకు క్రీడలతో మానసిక ఉల్లాసం, ఉత్తేజం లభిస్తుందని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. జాతీయ సర్వే దినోత్సవం పురస్కరించుకుని పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామంలో బుధవారం ఘనంగా క్రీడా పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడలను ప్రారంభించి, క్రికెట్ ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. గ్రామంలో సీనియర్లు, జూనియర్లకు విడివిడిగా క్రికెట్ పోటీలతో పాటు అందరికీ పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ మరియు జూనియర్ విభాగాల్లో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయని, పరుగు పందెంలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఈ నెల 10వ తేదీన జరగనున్న జాతీయ సర్వే దినోత్సవం రోజున బహుమతులను అందజేయడం జరుగుతుందని అన్నారు. అలాగే ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల అందజేత ఉంటుందని అన్నారు. క్రీడా స్ఫూర్తిని చాటిన ప్రతి ఒక్కరినీ కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా సర్వే మరియు భూరికార్డుల అధికారి ఎం.శ్రీనివాసరావు, స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వే విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# మంత్రి నారాయణ చొరవతో దశాబ్దాల జండా వీధి వాటర్ ట్యాంక్ లీకేజీ సమస్యకు చెక్ : కార్పొరేటర్ పోట్లూరి రామకృష్ణ




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని 47వ డివిజన్ పరిధిలో జండా వీధి వాటర్ ట్యాంక్ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. గత ఎన్నో ఏళ్లుగా ఈ వాటర్ ట్యాంక్ లీకేజీలతో ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, గత నెల రోజులుగా మరమ్మతు పనులను ముమ్మరంగా నిర్వహించి విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుతం లీకేజీలన్నీ పూర్తిగా అరికట్టబడి, జండా వీధి వాటర్ ట్యాంక్ సరికొత్తగా ముస్తాబైంది. అతి త్వరలోనే ఈ ట్యాంక్‌ను లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి సన్నాహాలు సిద్ధమవుతున్నాయి. గౌరవనీయులు, రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ విశేష సహకారం మరియు మార్గనిర్దేశంతో, దశాబ్దాల కాలంగా వేధిస్తున్న ఈ వాటర్ ట్యాంక్ లీకేజీ సమస్యను మనందరం సమష్టిగా పరిష్కరించుకోవడం జరిగింది. దశాబ్దాల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, మన 47వ డివిజన్ ప్రగతికి కొండంత అండగా నిలుస్తున్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణకి డివిజన్ ప్రజల తరపున, నా తరపున శిరస్సు వంచి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను." మీ పోట్లూరి రామకృష్ణ, 47 డివిజన్ కార్పొరేటర్.

# ఏపీలో స్వచ్ఛ విప్లవం : డంప్ యార్డ్ రహిత రాష్ట్రమే లక్ష్యంగా 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు

## - సమావేశంలో పాల్గొని ఆమోదం తెలిపిన స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్లు ఎం.నాగలక్ష్మి, బుచ్చా రామారెడ్డి






**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్‌ను డంప్ యార్డ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం భారీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రూ. 528.65 కోట్లతో 107 వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బోర్డు ఆమోదం తెలిపింది. ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఎండీ అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎం.నాగలక్ష్మి, బుచ్చా రామారెడ్డి మరియు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతిరోజూ 5,385 టన్నుల చెత్తను ప్రాసెస్ చేసి, తడి చెత్త నుండి నాణ్యమైన బయో-ఫెర్టిలైజర్లను తయారు చేయనున్నారు. తద్వారా చెత్త ద్వారా సంపద సృష్టించి మున్సిపాలిటీలకు ఆదాయం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యం. జూన్ మొదటి వారంలో 10 క్లస్టర్లలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి. అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థల నుండి చెత్తను సేకరించేందుకు ఏజెన్సీలను సిద్ధం చేయడంతో పాటు, గ్రామాల్లో పారిశుద్ధ్యం కోసం 210 యూనిట్లు, మొబైల్ ఎఫ్ఎస్టీపీ వాహనాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చిన్ని శ్రీనివాసరావు, రవి కుమార్, ఆరుద్ర భూలక్ష్మి, సీఈ వేణుగోపాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణపై అవగాహన ఉండాలి

## - పొన్నపూడి కొత్తూరు పాఠశాల హెచ్ ఎమ్ ప్రతాప్ కుమార్




**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రతి ఒక్కరు ఆరోగ్య పరిరక్షణ పైన అవగాహన కలిగి ఉండాలని పొన్నపూడి కొత్తూరు ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రతాప్ కుమార్ సూచించారు. నెల్లూరుకు చెందిన రూరల్ రీకన్స్ట్రక్షన్ అండ్ రీహేబిలిటేషన్ ఎడ్యుకేషనల్ సొసైటీ (ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పొన్నపూడి కొత్తూరు గ్రామంలోని పాఠశాలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో చర్చా సమావేశం నిర్వహించడంతో పాటు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ మనిషికి తన జీవితంలో అత్యంత విలువైనది, ప్రధానమైనది ఆరోగ్యమే అని అందుకే ఆనాడే మన పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అని చెప్పారని, ప్రతి ఒక్కరూ ఈ నానుడిని గుర్తుంచుకొని ఆరోగ్యాన్ని అత్యంత జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం సమాజంలో ఆహారం పూర్తిగా కల్తీ అయిపోయిందని, ప్రతి ఒక్కరు వారి వారి ఇళ్లలోనే కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకొని రసాయనాలు లేని కూరగాయలను పండించుకొని తినాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఎక్కడబడితే అక్కడ ఏమంటే అవి తినకుండా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సేవ సంస్థ అధినేత కొండూరు బాబు, వైద్య సిబ్బంది సుజాత యమునా, ఉపాధ్యాయులు శైలజ,సురేష్ లతో పాటు విద్యార్థులు, గ్రామస్తులుపాల్గొన్నారు. ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

# జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ విమానాశ్రయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కి ఘన స్వాగతం పలికిన దక్షిణ నియోజకవర్గం ఎంఎల్ఏలు వంశీకృష్ణ శ్రీనివాస్ ఆంధ్రా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కి జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ ఎంఎల్ఏ వంశీకృష్ణ శ్రీనివాస్ విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆప్యాయంగా పలకరించిన అధినేతతో పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రూరల్ అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే రమేష్ బాబు, ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలగకూడదు

## - జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి అధికారులను మరియు డీలర్లను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ అధికారులు, విత్తన-ఎరువుల డీలర్లు, రైస్ మిల్లర్లు మరియు రైతు ప్రతినిధులతో ఆయన సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమైన అంశాలను ప్రస్తావించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందుబాటులో ఉంచాలి. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో అవసరానికి తగినంత ఎరువుల నిల్వలను సిద్ధం చేసుకోవాలని, కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైస్ మిల్లర్లు చురుకైన పాత్ర పోషించాలని, రైతులకు చెల్లింపుల విషయంలో ఎటువంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు.విత్తనాలు మరియు ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, ఎక్కడా అధిక ధరలకు అమ్మకూడదని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ మండలాల నుంచి వచ్చిన డీలర్లు, మిల్లర్లు మరియు రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న గంట్ల

## - వరాహ స్వామితో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని బుధవారం సింహాచలం దేవస్థానం ధర్మ కర్తల మండలి మాజీ సభ్యులు. ప్రత్యేక ఆహ్వానితులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి డాక్ యార్డ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తెల్లవారుజామున విఐపి విరామ దర్శన సమయంలో గంట్ల శ్రీనుబాబు కుటుంబ సభ్యులు శ్రీవారిని దర్శించుకోవడం జరిగింది. స్వామి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదమంత్రాలు వల్లిస్తుండగా మృదు మధుర మంగళ వాయిద్యాలు నడుమ అర్చక స్వాములు ఆశీస్సులు అందించి శేష వస్త్రంతో సత్కరించి శ్రీవారి ప్రసాదం అందజేశారు. సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ లోకమంతా సుభిక్షంగా ఉండాలని తాను స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. అలాగే పాప వినాశనం, ఆకాశగంగ, వేణుగోపాలస్వామి ఆలయం, ఆంజనేయ స్వామి ఆలయం తో పాటు తిరుమలలో కొలువున్న శ్రీ వరాహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# రైతుల సంక్షేమం కోసం ఆధునిక సదుపాయాలు అందించడం మా ప్రధాన లక్ష్యం': కిమిడి నాగార్జున



**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందిచటమే లక్ష్యమని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం మినిస్టరీ ఆఫ్ పవర్ అనుబంధ సంస్థ ఈఈఎస్ఎల్ (జుజుూా) ప్రతినిధులతో డిసిసిబి కార్యాలయంలో నాగార్జున సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిసిసిబి ఈఈఎస్ఎల్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు (మీాఖలు) చేసుకున్నామని తెలియజేసారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను డిసిసిబి మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీలు) ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరికరాల వినియోగంతో రైతుల ఖర్చులు తగ్గి, ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం చేరువ చేయడం, వ్యవసాయ రంగంలో ఆధునీకరణ తీసుకురావడం లక్ష్యంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఈఈఎస్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ అనిల్ కుమార్ చౌదరి, డిసిసిబి సీఈఓ ఉమామహేశ్వరరావు, జనరల్ మేనేజర్లు వాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# నిరంతర శ్రామికుడు యువనేత నల్లపరెడ్డి రజత్ కుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ నేతలు

**కోవూరు, (రాజధాని వార్తలు):** మాజీ మంత్రి రాష్ట్ర పిఏసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తనయుడు కోవూరు నియోజకవర్గం వైసీపీ యువత విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రజిత్ కుమార్ రెడ్డికి బుధవారం జన్మదినమును పురస్కరించుకొని వైసీపీ నేతలు అభిమానులు ఆయనకు వెల్లువెత్తిన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, నిరంతరం ప్రజాసేవలో ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నమని నేతలు ఆకాంక్షించారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్సానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోప్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



**గూడూరు, (రాజధాని వార్తలు):** యువత డ్రగ్స్‌కు అలవాటు పడి ఎంతో మంది జీవితం, ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో బాగా చదువు కొని ఉన్నత స్థాయికి ఎదగాలని గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు వెల్లడించారు. డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సంస్థ తిరుపతి నుండి విశాఖపట్నం వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర యూనివర్సిటీకి చేరుకుంది. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డ్రగ్స్ నిర్మూల నకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ సిఐ కిషోర్ బాబు మాట్లాడుతూ యువత ఎంతోమంది మత్తు పదార్థాలకు బానిసలై నేరస్తులుగా మారుతున్నారని అనేక మందికి కౌన్సిలింగ్ ఇచ్చి ఇలా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తు న్నామని అన్నారు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ కలం సంస్థ తిరుపతి నుండి విశాఖపట్నం వరకు సైకిల్ యాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వైబ్రెంట్స్ ఆఫ్ కలాం సభ్యులు విజయ కలాం మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటి యువతను నాశనం చేసేందుకు అనేక శక్తులు మత్తు పదార్థాలకు యువతను బానిసలు చేస్తున్నారని మంచి పౌరు లుగా యువత దేశానికి సేవలు అందించాలని డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు విద్యార్థినీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సైకిల్ యాత్ర నెల్లూరు వైపు సాగింది. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై తిరుపతయ్య, ఈగల్ సబ్ ఇన్స్పెక్టర్ రాజీవ్ కుమార్, ఆది శంకర డీమ్డ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాజయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామయ్య, ప్రిన్సిపల్ అమరేంద్ర, చిన్నయ్య, ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపురం డివిజన్‌లో జిల్లా ఎస్పీ తనిఖీలు





**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం డిఎస్పి కార్యాలయాన్ని బుధవారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లను సందర్శించి, పెద్దాపురం డిఎస్పీ కార్యాలయాన్ని కూడా వార్షిక తనిఖీ నిర్వహించినట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా తొండంగి, తుని రూరల్, పెద్దాపురం డి ఎస్పీ కార్యాల యాలను సందర్శించి తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వార్షిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. దానిలో భాగంగా నేరాలు అదుపు నకు చర్యలు, రౌడీషీటర్లపై నిఘా, రానున్న డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ జయంతి వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా పెద్దాపురం డిఎస్పి కెవి సత్యనారాయణ పెద్దాపు రం డివిజన్ పరిధిలో నేరాలు, కేసుల పరిష్కారం వంటి వివరా లను ఎస్పీ బిందు మాధవ్‌కు వివరించారు. డిఎస్పి కార్యాలయం వద్ద ఎస్పీ బిందు మాధవ్‌కు తొలుత డిఎస్పి సత్యనారాయణ, సామర్లకోట సిఐ ఎ కృష్ణ భగవాన్, క్రైమ్ సీఐ అంకబాబు, ఎస్సై వి మౌనికలు ఎస్పీకి మొక్కలు అందించి ఘన స్వాగతం పలికారు. అలాగే స్టేషన్ సిబ్బంది పోలీసు డ్రిల్ ద్వారా ఎస్పీకి వందనం చేశారు. ఈ తనిఖీల్లో పెద్దాపురం డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్.ఐలు, ఇతర పోలీసులు పాల్గొన్నారు.

# ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి స్వేచ్ఛను హరించడమే

## - అమలాపురం ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి వైసిపి యత్నం

## - వైసీపీ విష సంస్కృతికి తార్కాణం : ఎంపీ హరీష్ బాలయోగి

**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్రజ్యోతి కార్యాలయంపై జరిగిన దాడి పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా సంస్థలు స్వేచ్ఛగా, నిర్భయంగా పనిచేయడం అత్యంత కీలకమని ఇటువంటి దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడిగా పరిగణిం చబడతాయన్నారు. ఈ దాడులకు పాల్పడిన వ్యక్తులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం బాధాకరమని హింసకు పాల్పడటం సమాజానికి హానికరమన్నారు. అమలాపురంలో ఆంధ్రజ్యోతి కార్యాలయంపై బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దాడికి ప్రయత్నించడం జిల్లాలో వైసీపీ విష సంస్కృతికి అద్దం పడుతోందన్నారు. ప్రజలంతా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను చూస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘ టనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు చేప ట్టాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పత్రికా రంగం భద్రత,



స్వేచ్ఛను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఈ సంఘటనపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# పిహెచ్సిని పరిశీలించిన డిసిసిబి ఛైర్మన్

## - మెరుగైన సేవలు అందించాలని ఆదేశం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పిహెచ్సి వైద్య బృందం పనిచేయాలని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామ స్వామి (బాబు) అన్నారు. బుధవారం సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులను ఆసుపత్రి పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామర్లకోట మండలంలో ఏకైక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉందని ఇక్కడికి సుదూర ప్రాంతాల నుండి అనేకమంది వైద్యసేవలు పొందేందుకు రోజుకి సుమారు 200 మంది ఓపి రావడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరికి వైద్యం సకాలంలో అందించి ప్రతి ఒక్కరికి బాధ్యతగా వైద్య సేవలు అందించాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లకు



ఆసుపత్రి యాజమాన్యం ఎలాంటి సదుపాయాలు కల్పిస్తుందనే అంశంపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేట్లపాలెం జనసేన నాయకులు పాలచర్ల సతీష్, కొండపల్లి కృష్ణమూర్తి, నల్లల నాగేంద్రబాబు, నలల శ్రీను, టిడిపి నాయకులు నూనె రామారావు, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan